కథా నిలయం
శ్రీకాకుళం

# కథల వెనక కథ

"నమస్తే. నా పేరు కామేశ్వరరావు. మా నాన్న గారు మీకు తెలుసుట. ఈ జాతకం మీకిమ్మన్నారు."

"కూర్చో బాబు"

జాతకం అందుకుని, కాబోయే మామగారు ఆప్యాయంగా అన్నారు

కామేశ్వరరావు ఎదురుగా కుర్చీలో కూర్చున్నాడు

"పెళ్ళికూతురు ఏమవుతుంది నీకు? అక్కయ్యా, చెల్లెలా?"

"చెల్లెలు"

"కొంచెం కాఫీ తీసుకోండి" అన్నాడు జాతకం వంక చూస్తూ.

"అబ్బే. యిప్పుడేం పెట్టకండి అలాంటివి. మరో సారి..."

"కాఫీ సిద్ధంగావుంది నాన్నా"

లోపలనుంచి వో కోమలకంఠం వినిపించింది.

"తీసుకురా"

అరిచాడు ముసలాయన లోపలికి వినిపించేలా.

ఓ పద్ధెనిమిదేళ్ళ అమ్మాయి స్టెయిన్‌లెస్ స్టీల్ గ్లాస్ నిండా కాఫీ తీసుకువచ్చి, కామేశ్వరరావు ముందుపెట్టి, ఓరగా చూసి లోపలికి వెళ్ళిపోయింది.

"నాకు పెళ్ళి కాకుండా ఉంటే బాగుండేది" అనుకున్నాడు కామేశ్వరరావు కాఫీ తాగుతూ.

"మా పెద్దమ్మాయి పి. యు. సి. పాసయింది. పెళ్ళి చేసేద్దామని చూస్తున్నాను, వీడి తర్వాత" ముసలాయన అన్నాడు, పరిచయం చేస్తున్నట్లుగా.

"పోస్ట్"

పోస్ట్‌మేన్ కొన్ని ఉత్తరాలు, ఓ పొడుగాటి కవరు అందించి వెళ్ళాడు ముసలాయనకి.

ఆ పొడుగాటి కవరుమీది ఫ్రం అడ్రస్ చదివి, చిన్నగా నవ్వుతూ లోపలికి వెళ్ళారు ముసలాయన.

"అమ్మాయ్, పత్రిక వాళ్ళు నీకేదో పంపారు."

"ఏదీ"

ఆత్రుతగా, ఆశగా వినపడింది ఇందాకటి కోమలకంఠమే పెద్దమ్మాయి.

"వాడిదగ్గరనుంచి కూడా ఉత్తరం వచ్చిందే."

"పెద్దాడేనా ? ఎప్పుడు వస్తున్నట్టు ?" వో క్రొత్త కంఠం

"మర్చిపోయాను. వియ్యంకుడు జాతకం పంపాడు, వాళ్ళబ్బాయి ద్వారా."

"వెళ్ళిపోయాడా ?

"బయట కూర్చున్నాడు"

"మరి చెప్పరేం. పలకరించకపోతే, తర్వాత బయటకివచ్చి మొహమైనా చూపించలేదనుకుంటారు."

నవ్వుకున్నాడు కామేశ్వరరావు; లోపలనుంచి వినపడుతున్న మాటలకి కర్టెనే అడ్డం.

కర్టెన్ పక్కకి తప్పించి బయటకి వచ్చింది వో ముసలావిడ, చేతులు కొంగుతో తుడుచుకుంటూ.

"నమస్కారం"

వినయంగా లేచినిలబడి అన్నాడు కామేశ్వరరావు.

"కూర్చో అబ్బాయ్ కాఫీ తీసుకుంటావా ?"

తలూపాడు కూర్చొని.

"అమ్మా, నాన్నా కులాసా ?"

తలూపాడు మళ్ళీ.

"జాతకం తీసుకువచ్చావుటగా, శాస్త్రులుగారికి చూపిస్తాము. అందరి భోజనాలయ్యాక నేనే వెళ్తాను. సాయంత్రం కనబడితే జాతకాలు కుదిరిందీ లేనిదీ చెప్తాను. మీ వాళ్ళకి రాయొచ్చు. నన్నే రాయమంటే రాయిస్తాను ఆయనచేత."

"అవసరం లేదు. సాయంత్రం నేనే వస్తాను."

లోపలనుంచి మాటలు, నవ్వులు, కేకలు వినబడ సాగాయి అకస్మాత్తుగా

"ఇప్పుడే వస్తాను."

కాబోయే వియ్యపురాలు గొడవ విని లోపలికి వెళ్ళి పోయింది

వూరికే ఎదురుగా గోడకి వేలాడుతున్న ఆంధ్రా బ్యాంక్ కేలండర్ని చూస్తున్న కామేశ్వరరావు చెవుల్లో పడుతున్నాయి అరుపులు, మాటలు.

"ఏం జరిగిందోయ్"

"రాధ ఏడ్చిందోయ్..."

"ఏం జరిగిందోయ్"

"కథ తిరిగొచ్చిందోయ్"

చిన్నపిల్లలిద్దరూ అరుస్తున్నారు. పాటలాగా పాడుతూ.

"అక్కయ్య కథ మళ్ళీ తిరిగొచ్చింది నాన్నా" చెప్తున్నాడు వో పిల్లవాడు.

"యీ సారి తగిన స్టాంపులు పెట్టకపోయినా మరీ తిరి గొచ్చింది నాన్నా. ఆ కథని నేనే బుక్ పోస్ట్ చేశాను."

"ఎవరిదో కంఠం. పద్నాలు గేళ్ళుంటాయి" అను కున్నాడు కామేశ్వరరావు.

కథ తిరిగొచ్చిందన్న సంగతి అర్థమయింది కామేశ్వర

రావు. ఇందాకా తను చూసిన, పోస్ట్‌మేన్ అందించిన పొడుగాటి కవరు గుర్తొచ్చింది. బ్రవున్ కలర్ కవరు !

ఆసక్తిగా వినసాగాడు మాటలు.

దాదాపు ఏడుపుతో నిండిన కంఠం.

"యీసారి చాలా బాగా రాశాను ఎంతో బాగా రాశాను. తప్పకుండా పడుతుందని, బుక్‌పోస్ట్‌లో పంపించాను. స్టాంప్స్ పెట్టకుండా అయినా తిరిగొచ్చింది."

ఆ కోమలకంఠమే అని గుర్తించాడు కామేశ్వర్రావు.

'పేరేమిటి? 'రాధ నవ్వింది' బావుందే పేరు'

ముసలాయన కంఠం

'రాధ నవ్వింది?'

ముందుకు వంగాడు కామేశ్వరరావు యింకా ఆసక్తిగా.

"రాధ ఏడ్చింది అని పెడితే పడేదేమో!"

"అసలు పత్రికల వాళ్ళకి బుద్ధిలేదు. ఎప్పుడూ వేసుకున్నవాళ్ళ కథలే వేసుకుంటారు. కొత్తవాళ్ళవి వేసుకోకుండా తిప్పి పంపించేస్తాను. అసలు చదవరేమో కూడా.

వెక్కిళ్లు!

"మరో పత్రికకు పంపుదువుగాని అయిదారుదాకా ఉన్నాయిగా పత్రికలు"

"ఏం జరిగిందోయ్?"

"కథ తిరిగివచ్చిందోయ్."

"ఏం జరిగిందోయ్ "
"రాధ ఏడ్చిందోయ్."
"ఏం జరిగిందోయ్
కథ తిరిగొచ్చిందోయ్."
"ఎలా వచ్చిందోయ్ ?
"ఎలా వచ్చిందోయ్! మళ్ళీ చిన్నపిల్లల పాట.
'ఆపండి'
ఏడుపు మధ్య అరుపు
'మాడు నాన్నా ఈ వెధవలిద్దరూ...'
'ఆపండిరా నోరు తెరిస్తే చంపుతాను'

ముసలాయన కోప్పడ్డాడు చిన్నపిల్లలిద్దరినీ. చిన్న పిల్లలు ముసి. ముసినవ్వులు వినిపించాయి. ఏదో కొంటెపని చేసినట్లున్నారు యిద్దరూ ముసలాయనతో సహా అందరూ నవ్వారు పెద్దమ్మాయి నవ్వుమాత్రం వినపడలేదు కామేశ్వరరావుకి

'ఛీ ఛీ అసలింకెప్పుడూ కథలే రాయను. ఈ ఇంట్లో ఎప్పుడూ ఇంతే'

"నిన్ను చూసి కాదే నవ్వింది. వీళ్ళిద్దరూ"

"చెప్పనక్కర లేదు నాకు తెలుసు. అంత నవ్వే వాళ్లు చేతనయితే నే సిన కథలాంటిది రాయండి చూద్దాం"

'రాధ ఏడ్చిందోయ్.'

గబగబా అడుగులచప్పుడు వెంటనే గట్టిగా తలుపులు వేసుకున్న చప్పుడు లీలగా వెక్కిళ్ళమధ్య ఏడుపువినిపించాయి కామేశ్వరరావుకి

“వెధవా దాన్ని ఏడిపించవద్దు! చెప్పానా? ఫో బయటకి తగలడు.”

ముసలావిడ అరుపుతో పధ్నాలుగేళ్ళ పిల్లాడొకడు తొమ్మిదేళ్ళ పిల్లాడొకడు, కామేశ్వరరావు కళ్ళముందు నుంచే బయటకి పరుగెత్తారు. గుమ్మందగ్గర ఆగి, లోపలకి తిరిగి ‘రాధ ఏడ్చిందోయ్’ అని అరిచి వీధిలోకి దూకారు.

నవ్వుకున్నాడు కామేశ్వరరావు. తెరలు తెరలుగా వస్తున్న నవ్వుని ఆపుకున్నాడు బలవంతంమీాద, కేలండర్ వంక చూస్తూ

బయటికివచ్చిన ముసలాయన, కూర్చునివున్న కామేశ్వరరావువంక చూసి అన్నాడు.

“మీరంతా వినేవుంటారు.”

ఆపుకోలేక పకపకా నవ్వాడు కామేశ్వరరావు.

“విన్నాను”

“దీనికి కథలపిచ్చి విపరీతంగా చదువుతుంది. అప్పుడప్పుడు రాస్తూంటుంది. ఒకటి, రెండు వ్యాసాలుపడ్డాయి. అదేం ఖర్మో, అన్ని కథలూ తిరిగొచ్చాయి. వచ్చినప్పుడల్లా ఇదేతంతు ”

“వచ్చిప్పుడల్లా ఏడిపిస్తారా?”

“అహ. వాళ్ళువద్దంటే వినరు. అయినా పుడుకొక్కనే

వాళ్ళని ఎవరు మాత్రం ఏడిపించకుండా వుంటారు' అన్నాడు ముసలాయన కొంచెం కంఠం తగ్గించి.

"కథలు తిరిగివస్తే బాధే" అన్నాడు కామేశ్వరరావు ఆలోచనగా.

"చచ్చిపోతాము ఆ రోజు, గదిలోనే వుండిపోతుంది, తలుపు బిగించుకొని. అన్నానికి పిలిస్తే రాదు. వాళ్ళమ్మ బ్రతిమాలి, ఏదో కొంచెం తినిపిస్తుంది, బలవంతంగా."

కామేశ్వరరావు ఆలోచనగా చూస్తూండిపోయాడు కేలండర్ వంక.

"మనలో మాట నేను ఎఫ్. ఏ. చదువుతున్నప్పుడు నా కథలుకూడా చాలా తిరిగివచ్చాయి, పత్రికలనుంచి.

ముసిముసిగా నవ్వుతూ అన్నాడు ఆయన.

"కథలు తిరిగివచ్చినప్పుడు ఇలా ఏడిపించకూడదు. ఏడిపిస్తే కథలు రాయాలనే ప్రోత్సాహం తగ్గిపోతుంది అసలు మనం మంచి కథలు రాయలేమేమో అనే ఓ ధైర్యం ఆ విధ ముయిః ఇన్‌ఫీరియారిటీ కాంప్లెక్స్ మనలో స్థిరపడిపోతాయి ఎప్పుడు కథ మొదలుపెడదామన్నా, రాయటం ఎందుకు ఇదెట్లాగూ తిరిగొస్తుంది" అన్న నిస్పృహా కలుగుతుంది. ఎంకరేజ్ చేయాలి బాగా.

"అవును, కాని పిల్లలు వూరుకోరు"

"మీరు కొప్పడి వూరుకోబెట్టాలి. ఇంకో సారి ఇలా జరగనివ్వకండి."

"కథ బాగానేవుంది, ఎందుకు తిప్పిపంపాడీ దుర్మార్గుడు."

నవ్వాడు కామేశ్వరరావు, ముసలాయనతో పాటుగా.

"తిరిగి వచ్చినంత మాత్రాన కథ బాగుండలేదని కాదు అర్థం, ఆ కథ చదివే వ్యక్తి మీద ఆధారపడి వుంటుంది. అతని ఆలోచనలకి, స్వభావానికి, ఇష్టానికి అందుబాటులో వుంటే ఆ కథ ప్రచురితమవుతుంది. కథ బాగుండి కూడా అతనికి మాత్రం నచ్చకపోతే తిప్పి పంపేస్తాడు దాన్నే మరో పత్రికకు పంపితే ప్రచురితమవుతుంది పాఠకులనుంచి బాగుందని ఎక్కువ ఉత్తరాలుకూడా రావచ్చు."

"కావచ్చు. ఏం లాభం ?"

"ఒక్కొక్కసారి కథ బాగుండికూడా దానికన్నా మరికొంచెం మెరుగ్గా వున్న కథలు చాలా వుండటంతో దాన్ని తిప్పి పంపేయటం జరుగుతుంది వారానికి వాళ్ళు వేసుకొనే కథలసంఖ్య తక్కువ కాని వచ్చే కథలు వందలు. అన్నిటికన్నా ఆణిముత్యాల్లావున్న కథలే ప్రచురిస్తారనుకుంటాను."

"ఆ కథని మరో పత్రికకి పంపించమంటావు ?"

"అవును."

"నీ కథలు కూడా ఏమయినా...?"

"లేదు."

నవ్వుతూ చెప్పాడు కామేశ్వరరావు.

"మరయితే ఇదంతా ఎలా తెలుసు ?"

సమాధానం చెప్పలేదు కామేశ్వరరావు. మౌనంగా ఉండిపోయాడు.

"మధ్యాహ్నం భోజనం చేసినతర్వాత వెళ్తాను; జాతకము చూపించటానికి."

"మంచిది. సాయంత్రం ఆఫీస్‌నుంచి తిరిగి వస్తూ రానా!"

"తప్పకుండా."

లేచాడు కామేశ్వరరావు.

గుమ్మం దాకా వెళ్ళి ఆగి అన్నాడు మళ్ళీ.

"బహుశ ఆ కథ తప్పకుండా ప్రచురింపబడుతుంది.

"మర్చిపోయాను అడగటం; నువు ఎక్కడపనిచేసేది.

అడిగాడు ముసలాయన.

కొన్ని క్షణాల తర్వాత తటపటాయిస్తూ చెప్పాడు కామేశ్వరరావు సమాధానం.

* * *

కామేశ్వరరావు కూర్చున్న గదిలోకి వినపడుతుంది చప్పుడు, కొంచెం కొంచెంగా.

ఆఫీస్‌గది బయట, రాబోయే సంచికకి ప్రింటవుతున్న మొదటి రెండు ఫారాలకి సంబంధించిన ప్రింటింగ్ మెషీన్ల చప్పుడు వినపడుతుంది.

కుర్చీలో కూర్చుని, దీక్షగా చదువుతున్నాడు, రచయితలనుంచి వచ్చిన కథలు, చేతిలోని రంగుపెన్సిల్‌తో 'రైట్' గుర్తు 'ఇంటూ' గుర్తు పెడుతున్నాడు. 'ఇంటూ'

గుర్తు పెట్టిన కథలవెనుక 'ఆర్' అని రాస్తున్నాడు పెన్సి ల్తో. అవి తిప్పి పంపబడతాయి, పోస్టేజ్ వుంటే.

కామేశ్వరరావు మద్రాస్ నుండి వెలువడే వో తెలుగు వారపత్రికకి సబ్—ఎడిటర్. రెండు సంవత్సరాలుగా పని చేస్తున్నాడు. అక్కడకి వచ్చిన కథలన్నీ చదివి, బావు న్నవి ఎడిటర్‌కి పంపడం, ప్రూఫ్‌రీడింగ్స్ చూడటం మొద లయిన పనులు చూస్తుంటాడు. కామేశ్వరరావు గాక మరో ఇద్దరు సబ్.ఎడిటర్స్ పని చేస్తున్నారు.

వారపత్రిక చదివే ప్రతీ పాఠకుడు సరదా కోసమో, పేరు రావాలనీ జీవితంలో వో సారయినా వో కథ రాసి పంపుతాడు. రాసి, పాప్యులారిటీ ఎక్కువ వున్న ఆ పత్రి కకే పంపుతాడు మొదట,

దాదాపు లక్ష కాపీలదాకా అమ్ముడయే ఆ పత్రికకి వారానికి వందలకథలపైనే వస్తాయంటే ఆశ్చర్యంలేదు. పాటిలో అయిదారే ఎన్నికయేవి. అన్నీ చదవాలి. విసుగు పుడుతుంది కామేశ్వరరావుకి, ఒక్కోసారి, సగం చదివి తిప్పి పంపేస్తాడు, సహనం నశించి

కామేశ్వరరావు మనసు ఆఫీసు పనిమీద లేదు. ముస లాయన ఇంటినుంచి తిరిగివచ్చిన తర్వాత "రాధ నవ్వింది" చుట్టూ తిరుగుతున్నాయి ఆలోచనలు. మనసు ఆ కథ రాసిన ముసలాయిన పెద్దకూతురు చుట్టూ తిరుగుతోంది.

"రాధ నవ్వింది!"

మొన్న తనే చదివాడు ఆ కథని. ఫర్వాలేదు. ప్రచు రార్థంగా వున్నది. కాని వారం రోజులముందే, ఓ కథని సెలెక్ట్ చేశాడు కామేశ్వరరావు. ఎడిటర్ కూడా ఆమో దించాడు దాని ప్రచురణకి. ఆ కథ ప్రచురింప బడుతుందని, రచయితకి వుత్తరం కూడా రాసేయడం జరిగింది.

"రాధ నవ్వింది" ఆ కథా దాదాపు ఒకే మాదిరిగా వుండటంవల్ల, ప్లాట్, థీమ్ దాదాపు ఒకటే అవటంవల్ల, "రాధ నవ్వింది" తిప్పి పంపబడింది పోస్టేజ్ పంపకపోయినా. ఆ కథ వున్నతస్థాయిలో వుండటంవల్లా, ఆఫీస్ ఖర్చుతో రచయితకి తిప్పి పంపమని డిస్పాచ్ క్లర్కుకి చెప్పాడు.

ఎన్నివందల కథలో చదివాడు. ఎన్ని వేలకథలో తిప్పి పంపించేసాడు. కాని ఆకథ తిరిగి వచ్చినప్పుడు ఆ కథా రచయిత ఏవిధంగా ఫీల్ అవుతాడో, ఎంతబాధపడతాడో ఎప్పుడూ కామేశ్వరరావు అనుభవంలోకి రాలేదు.

ఆ ముసలాయన ఇంట్లో మొదటిసారిగా తెలుసు కున్నాడు కామేశ్వరరావు. కథ తిరిగివస్తే ఏమవుతుందో దాదాపు ప్రతీ ఇంట్లో ఇదే తీరుగా వుండవచ్చు. అంటే తను పరోక్షంగా అనేకమంది రచయితల మనస్తాపానికి గురవుతున్నాడు, అనేకమందిని బాధపెడుతున్నాడు.

బాధ పెట్టడమే కాదు. తను దూషించబడు తున్నాడు కూడా.

"పత్రికల వాళ్ళకి బుద్ధిలేదు"

"తిప్పి పంపించేసాడు దుర్మార్గుడు"

ముసలాయన ఇంట్లో విన్న మరికొన్ని మాటలు గుర్తుకువచ్చాయి.

చేతిలోని రంగుపెన్సిల్‌తో కాగితం మీద పిచ్చి గీతలు గీస్తూ ఆలోచిస్తూండిపోయాడు. ఏడుస్తున్న ముసలాయన పెద్దమ్మాయి రూపం గుర్తుకువచ్చింది. వూహించుకోగలిగాడు. ఎలా వుంటుందో.

పాపం జాలివేసింది కామేశ్వరరావుకి. ఒక్క ఆ అమ్మాయే కాదు. మరికొన్ని వందలు అలాంటి వాళ్ళని వూహించుకోగలిగాడు.

ప్రక్క టేబిల్స్ వంక చూసాడు. మిగతా ఇద్దరు సబ్-ఎడిటర్స్ కథలు చదువుతున్నారు. రంగు పెన్సిల్‌తో గుర్తులు పెడుతున్నారు కథలమీద. చాలాభాగం తిప్పి పంపబడుతాయి.

వాళ్ళని చూస్తే చేతిలోని ఆ పెన్సిల్స్, మొహంలోని సీరియస్‌నెస్, దీక్షనిచూస్తుంటే, ఆపరేషను థియేటర్లో చేతులలో కత్తులతో ఆపరేషనుచేసే డాక్టర్లు గుర్తుకు వచ్చారు కామేశ్వరరావుకి.

చిన్నగా నవ్వుకున్నాడు, ఇన్నాళ్ళు కలగని తన కొత్త ఆలోచనకి.

తను సెలెక్ట్ చేసిన కథల ఫైల్ పట్టుకున్న కామేశ్వరరావు ఎడిటర్ గదిలోకి వెళ్ళాడు. కథల ఫైల్ టేబిల్ మీద పెట్టి అన్నాడు.

"నేను బి. కాం. ప్యాసయ్యాను."

విచిత్రంగా చూసాడు ఎడిటర్ కామేశ్వరరావు వంక, అర్థంకాని ఈ సంభాషణకి.

"అయితే?"

"చిన్న రిక్వెస్ట్, నన్ను ఎకౌంట్స్ సెక్షన్ కి మార్పించండి."

"ఏం ? ఇక్కడ బాగాలేదా?"

"లేదు."

"దేనికి?"

"నాకు కథలు చదివే పని వద్దు."

"విసుగెత్తిందా!"

"కాదు. కథలు తిప్పిపంపితే, అవి రాసే వాళ్ళు ఏ విధంగా బాధపడతారో ఈ రోజే చూసాను కథలు రాసే వాళ్ళని అలా బాధపెట్టడం నాకిష్టం లేదు.

"కూర్చోండి" అన్నాడు ఎడిటర్ నవ్వి

కామేశ్వరరావు ఎదురుగా కుర్చీలో కూర్చున్నాడు.

"మనపత్రికలో బావుండని కథలు వేసుకోలేం కదా, రాసినవాళ్ళు బాధ పడతారని తిప్పి పంపకుండా "

"అవును. అందుకే నాకా పని ఇష్టం లేదు."

"మీరు లేకపోయినా, మరో వ్యక్తయినా ఆ కథలు తిప్పి పంపుతాడు. అప్పుడు మాత్రం వాళ్ళు బాధ

పడరా! మీరయినా, మరో వ్యక్తినయినా చేసే పని అది కదా!"

"కాని అది నా చేతుల మీదుగా జరగడం నా కిష్టం లేదు" స్థిరంగా అన్నాడు.

"నమ్మలేను మీలో ఇంత పట్టుదల వచ్చిందంటే"

కామేశ్వరరావు కళ్ళల్లోకి చూస్తూ అన్నాడు ఎడిటర్ ఆశ్చర్యంగా.

"నిన్నటిదాకా నేనూ అనుకోలేదు. కొన్నికొన్ని సంఘటనలు మనుషుల మనస్సులని విపరీతంగా కదిలిస్తాయి, అవి ఎంత సిల్లీవయినా, చిన్నవయినా, అది ఆ వ్యక్తి బల హీనతే కావచ్చు, మరేమయినా కావచ్చు.

"కొన్ని రోజులు ఆగండి. డైరెక్టర్‌కి రికమెండ్ చేస్తాను. చీఫ్ ఎకౌంట్స్ ఆఫీసర్‌తో మాట్లాడతాను."

"దయచేసి వీలయినంత త్వరగా చేయండి. అప్పటి దాకా కథల విషయం చూడను నేను. మిగతా విషయాలు చూస్తాను"

చిన్నగా నవ్వాడు ఎడిటర్.

"చిన్నప్పటినుంచి శవాలని కాల్చడమే వృత్తిగా వున్న వో కాటికాపరి వో సారి శవం కాలుస్తూ, ఆ శవం తాలూకు బంధువుల దుఃఖం చూసి ఆపని మానేస్తే చాలా మంది నమ్మలేరు. ఆ మార్పు నాకూ అనుభవమే. కొన్ని సంఘటనలు మనసులో చాలా బలంగా నాటుకుంటాయి. వాటిని తీసిపారేయలేం."

కామేశ్వరరావు లేచి నిలబడ్డాడు.

"వీలయినంతవరకు వాళ్ళు మిమ్మల్ని తిట్టకుండా వుండేందుకు ప్రయత్నం చేస్తాను."

చేత్తో కామేశ్వరరావు తెచ్చిన కథల ఫైల్ని తడుతూ అన్నాడు ఎడిటర్ నవ్వుతూ.

"థాంక్స్ సర్."

ఎడిటర్ గదిలోంచి బయటకు వచ్చిన అయిదు నిము షాలకి ఫోన్ వచ్చింది కామేశ్వరరావుకి, వుత్తరం రాస్తూంటే.

"రాధ నవ్వింది" కథ పొరపాటున తిప్పి పంపడం జరిగిందనీ, అది సెలక్ట్ చేయబడిందనీ, కథ పత్రికాలయానికి తిప్పి పంపమనీ వుత్తరం రాశాడు కామేశ్వరరావు, ముసలాయన పెద్దకూతురుని.

"హలో కామేశ్వరరావు హియర్" అన్నాడు రిసీవర్ అందుకుని.

ముసలాయన జాతకం కుదరలేదని, కామేశ్వరరావు చెల్లెలికీ, తన పెద్దకొడుక్కీ సంబంధం కుదరదనీ చెప్పాడు ముసలాయన.

రిసీవర్ పెట్టేసి, కథల రిజిష్టర్ తిరగేసి ఎడ్రెసు వుత్తరం మీద రాసి సంతకం కోసరం ఎడిటర్ గదిలోకి వెళ్ళే కాగితాల ఫైల్లో పెట్టాడు కామేశ్వరరావు.

"రాధ నవ్వింది" రచయితకి ఆ వుత్తరం చేరినపుడు ఎంత ఆనందపడుతుందో వూహించుకోనగలడు సబ్-ఎడిటర్ కామేశ్వరరావు.

***